వేదిక
'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# సార్వత్రిక సమరభేరి

**మహాభారత** సంగ్రామానికి నగారా మోగింది. దేశంలోని పార్టీలన్నీ తమ తమ స్థాయికి తగ్గట్టుగా శంఖాలను పూరిస్తున్నాయి. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం అన్నిటికంటే ఒక రవ్వ ఎక్కువ సందడి చేస్తున్నది. విధానాలు, కార్యక్రమాల కంటే తమకు ఇన్ని సీట్లు వస్తాయని, అన్ని సీట్లు వస్తాయని ఊదరగొడుతున్నది. అటు అంతర్గత కలహాలతో ఇండియా కూటమి కొట్టుమిట్టాడుతుండగా.. ఇటు కొత్తగా కలిసివచ్చే మిత్రులను కలుపుకొంటూ ఎన్డీయే కూటమి సమరోత్సాహంతో దూకుడుగా వ్యవహరిస్తున్నది. అయితే వీటిలో ఒకటి మతాన్ని అడ్డుపెట్టుకొని.. మరొకటి ఉచితాల ఎర వేస్తూ ఎన్నికల గోదాలోకి దిగుతున్నాయి. అంతే తప్ప దేశ ప్రయోజనాలకు పెద్దపీట వేసే సుదీర్ఘకాల ప్రణాళికలు ఉన్నట్టు వారి ప్రచారాల్లో ఎక్కడా కనిపించడం లేదు. ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు చేశామో చెప్పుకొని ఓట్లు అడిగే ధైర్యం బీజేపీకి లేదేమో. అందుకే పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తదితర అంశాలు ప్రచారంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది. అదే సమయంలో దేశంలోని సమస్యలను లేవనెత్తడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ఇప్పటికీ బీజేపీ వ్యూహం నుంచి బయటకు రాలేకపోతున్నది.

మరోవైపు ఎన్నికల కమిషన్ నిబద్ధతపై ప్రతిపక్ష పార్టీలు వేలెత్తి చూపుతున్నాయి. బీజేపీకి లాభం చేకూరేలా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్నదని, అందుకే ఆ పార్టీకి అనుకూలంగా ఉండేలా సుదీర్ఘమైన షెడ్యూల్‌ను విడుదల చేసిందని ఆరోపిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో ఏడు దశల్లో ఎన్నికలుండేలా షెడ్యూల్‌ను విడుదల చేయడాన్ని అందుకు ఉదాహరణగా చూపిస్తున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణలకు బలం చేకూరేలా ఇటీవల ఎన్నికల కమిషన్‌లో పలు పరిణామాలు జరగటం గమనార్హం. పార్లమెంట్ ఎలక్షన్ల వేళ స్పష్టమైన కారణం లేకుండానే ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, కేంద్ర ప్రభుత్వం ఆ స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చడం వివాదాస్పదమైంది. సుప్రీంకోర్టులో దీనిపై కేసు నడుస్తుండగానే కొత్త పద్ధతిలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేయడం గమనార్హం. స్వయంగా తనపైనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించి, తనను తాను నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉన్నది. ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి, మరోవైపు తెలంగాణ గవర్నర్ కూడా ఎన్నికల సమరంలోకి దూకుతున్నారని వార్తలు వినవస్తుండటం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమే.

దేశమంటేనే రాష్ర్టాల కలయిక. ఈ ఎన్నికల్లో జాతీయ ఎజెండా మాత్రమే ఉంటే సరిపోదు. ప్రాంతీయ ఆశలు, ఆకాంక్షలు కూడా ఎన్నికల హామీల్లో ప్రతిఫలించాల్సిందే. అయితే జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ఈ విషయంలో కొన్ని పరిమితులున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ తరహాలో దేశంలోని అనేక ప్రాంతాల్లో స్థానిక అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలున్నాయి. ప్రాంతీయ ఆకాంక్షలకు పెద్దపీట వేసే పార్టీలు ఈ సారి కొంత మెరుగైన ఫలితాలు సాధిస్తాయనే వాదనలు బలంగా వినవస్తున్నాయి. బీజేపీ మూడో విడత ప్రయత్నాలు, కాంగ్రెస్ మరో చాన్స్ ప్రచారాల మధ్య ప్రాంతీయ పార్టీల పాత్ర పెరిగితే.. కేంద్రం ఏకచ్ఛత్రాధిపత్యం కొంత తగ్గిపోతుంది.

# విశ్వసనీయత లేని అరెస్టు

ఒకప్పుడు ఒకరి అరెస్టు అనగానే అందరూ ఆ కేసులో నిజం ఉందని నమ్మేవారు. కాలం గడిచి, రాజకీయాలు భ్రష్టుపట్టిన కొద్దీ ప్రజలకు ఆ రాజకీయాలపైన, ప్రభుత్వాలపైన, పోలీసు ఏజెన్సీలపైన విశ్వాసం తగ్గటం మొదలైంది. అందుకు పర్యవసానంగా రాజకీయ అరెస్టులపై కూడా విశ్వాసం తగ్గుతూ వస్తున్నది. ఈ స్థితి కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పరాకాష్ఠకు చేరుకుంది. ఇప్పుడు ఈ అరెస్టులకు ప్రజల్లో ఎటువంటి విశ్వసనీయత లేకుండాపోయింది. అందుకు కారణం దేశ ప్రజలకు ఎవరో, ఏదో చెప్పి బోధించడం కాదు. అన్ని పరిణామాలు గత పదేండ్లుగా తమ కండ్ల ఎదుటే జరుగుతున్నవి. వాటిని బట్టి ప్రజలు ఇటువంటి అభిప్రాయానికి వస్తున్నారు.



టంకశాల అశోక్



బీఆర్ఎస్ నాయకురాలు కవిత కేసునే గమనించండి. ఢిల్లీ ప్రభుత్వ మద్యం విధానం కేసులో ఆమె నిందితురాలు. ఆ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా సహా మరికొందరిని నిందితులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేర్కొన్నది. ఇప్పుడు అసలు ఆ విధానమే లేదు, రద్దయింది. అయినా కేసు ఏడాదికి పైగా సాగుతున్నది. ఈడీ ఇంతకాలంలో మరికొద్ది మంది నిందితులు తనకు లొంగిపోయి ఇచ్చిన వాంగ్మూలాల ప్రకటనలు మినహా ఆధారాలు ఏవీ సంపాదించలేక పోయింది. ఆ మాట మనం అనటం కాదు. స్వయంగా ఢిల్లీలోని సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ అన్నారు. ఆయన ఈ మాట అని ఇప్పటికి 10 నెలలు గడిచాయి. అయినప్పటికీ అసలు ఏ నిందితులపై కూడా తగిన సాక్ష్యాధారాలు సేకరించి చూపలేకపోయారు. ఈడీ మాత్రం ఆ కేసును నిందితులపై దాడులు, సోదాలు, అరెస్టుల పరంపరలతో ఎడతెగకుండా కొనసాగిస్తూనే ఉంది. అందులో భాగంగా కవితను ఈ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకువెళ్లారు. దీనిని బట్టి ప్రజలకు కలిగే అభిప్రాయం ఏమిటి? ఈ కాలమంతా ఈడీ విచారణకు ఆమె సహకరిస్తూనే వచ్చారు. ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి ఎన్నోసార్లు హాజరయ్యారు. కానీ, అధికారులు ఇంతవరకు తేల్చగలిగింది ఏమీ లేకపోయింది. తనకు శనివారం నాడు వారం రోజుల రిమాండ్ ఒక రొటీన్ విషయం.

మోదీ అధికారానికి వచ్చినప్పటి నుంచి ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలకు విశ్వసనీయత లేకుండా పోవడంలో ఇది ఒకానొక ఉదాహరణ మాత్రమే. ఇటువంటి సందర్భాలు కోకొల్లలన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం. ఒకవేళ ఇటువంటివి ఒకటి రెండు మాత్రమే జరిగి ఉంటే, అవి అసత్యపు కేసులు అయినప్పటికీ, ప్రజలలో విశ్వసనీయత ఏర్పడేదేమో. కానీ అట్లా కాదు. అవి డజన్లకొద్దీ కనిపిస్తున్నాయి. దేశమంతా ఉంటున్నాయి. ఈ పదేండ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఎవరిపైన? బీజేపీతో ఏకీభవించని వారిపైన, ప్రతిపక్షాలపైన. ఆ పార్టీకి లొంగని వారిపైన. ఎవరైనా కేసులకు, దాడులకు భయపడి ఆ తర్వాత లొంగివస్తే వారిపై కేసులు వెంటనే రద్దవుతున్నాయి లేదా నిరవధికంగా పెండింగులో పడుతున్నాయి.

> బీజేపీయేతరులపై పెట్టిన కేసులలో చివరకు రుజువు అవుతున్నవి అత్యల్పం. ఇవేవీ ఊహాగానపు మాటలు కావు. అన్నింటికీ స్పష్టమైన లెక్కలు, పేర్లు ఉన్నాయి. నిజానికి ఇవన్నీ తరచూ పత్రికలలో వెలువడుతున్నవే. కొంత దృష్టి పెట్టి వార్తలు చదివేవారికి తెలిసినవే. ఎప్పటికప్పుడు సామాన్యులు కూడా మాట్లాడుకుంటున్నవే. ఈ తరహా కేసులకు, ప్రభుత్వానికి విశ్వసనీయత లేకుండా పోయింది అందువల్లనే.

అందరికీ తెలిసిన విషయాలే అయినప్పటికీ ఇప్పుడు ఒక సందర్భం ఏర్పడింది కనుక ఆ వివరాలు కొద్దిగా చెప్పుకుందాం. మోదీ పదేండ్ల పాలనలో ప్రతిపక్ష నాయకులపై ఈడీ పెట్టిన కేసులు 5,150 కాగా రుజువైనవి కేవలం 24. సీబీఐ కేసులు 118 కాగా రుజువైనవి 0.42 శాతం మాత్రమే. తక్కినవి నిరవధికంగా అట్లా సాగుతూనే ఉన్నాయి. వాటిని ఆధారం చేసుకుని ప్రతిపక్ష నేతలను వేధించటం, బీజేపీకి లొంగిపోవాల్సిందిగా ఒత్తిడి చేయడం అంతులేకుండా జరుగుతున్నాయి. ఇక బీజేపీకి లొంగిపోయినవారిపై కేసులు నిరవధికంగా పెండింగులో పడిపోవడం, అంతకుమించి వారి ప్రాముఖ్యతను బట్టి పదవులు సైతం కట్టబెట్టడం చేస్తున్నారు. అందుకు రెండు ఉదాహరణలు తెలుగువారి నుంచే ఉండటం తెలిసిందే. వారు టీడీపీ పార్లమెంటు సభ్యులైన సీఎం రమేష్, సుజనా చౌదరి. ఇందులో రమేష్‌పై ఈడీ, ఐటీ.. సుజనా చౌదరిపై ఈడీ, సీబీఐ దాడులు జరిపాయి. వారు బీజేపీలో చేరి నాలుగేండ్లకు పైగా గడిచిపోయాయి. దానితో ఇక దాడులు, విచారణలు, కేసులు ఏవీ లేకుండా పోయాయి. వీరిద్దరే గాక నారాయణ రాణే, అజిత్ పవార్, సువేందు అధికారి, హిమంత బిశ్వశర్మ, ముకుల్ రాయ్, జ్యోతిరాదిత్య సింధియా తదితర దేశమంతా తెలిసిన ప్రముఖులు మరెందరో ఉన్నారు. ఇటువంటి తీరును ప్రతిపక్షాలు, మీడియా, మేధావులు ఎంతగా ఎత్తిచూపినా, తీవ్రమైన విమర్శలు చేసినా ఆయా సంస్థల నుంచి గానీ, ప్రధాని మోదీ నుంచి గానీ ఉలుకూపలుకూ లేదు. ఆ సంస్థలు స్వతంత్రమైనవని, అవి తమ పని తాము చేస్తాయని, రాజకీయ జోక్యం ఏమీ లేదని మొక్కుబడి మాటలు చెప్పటం మినహా. అందుకు ప్రజల దృష్టిలో విశ్వసనీయత లేదన్నది వేరే చెప్పనక్కర్లేదు. మొత్తం ఈ విధమైన పదేండ్ల తీరుకు అనుగుణంగానే ప్రస్తుతం కవితపై కేసు, దాడులు, అరెస్టు వ్యవహారం సాగుతున్నది. ఇవన్నీ ప్రజలు ఎప్పటికప్పుడు చూస్తున్నవే.

మోదీ దురదృష్టవశాత్తు ఈ పరిణామాలు ఎన్నికల బాండ్ల కేసు సందర్భంలో జరగటం గమనించదగినది. తమ నీతి గురించి, తమ ప్రభుత్వం అవినీతిని సహించకపోవటం గురించి, అవినీతిని నిర్మూలించటం గురించి, తమ పార్టీలో, ప్రభుత్వంలో అవినీతిపరులకు స్థానం లేకపోవడం గురించి ప్రధానమంత్రి తరచూ దృఢమైన స్వరంలో మాట్లాడుతుంటారు. అందులో నిజమెంతో మనం పైన చర్చించిన విషయమే తిరుగులేని విధంగా స్పష్టం చేస్తున్నది. ఈ సమయంలో ప్రస్తావనకు రాకపోయినా ఆయన ప్రభుత్వం తమ ఆశ్రిత పెట్టుబడిదారుల కోసం ప్రత్యేకంగా ఏమేమి చేస్తూ వస్తున్నదో తెలిసిన విషయమే. అవి తెరవెనుక జరుగుతూ సాధారణ ప్రజల దృష్టికి అంతగా రావని అనుకోవచ్చు. కానీ, నిన్నమొన్ననే ఎన్నికల బాండ్ల వ్యవహారం సుప్రీంకోర్టు ఉత్తర్వుల వల్ల బయటకు వచ్చి ప్రభుత్వ పెద్దల నీతి ప్రవచనాల్లోని డొల్లతనాన్ని దేశమంతటి ముందు బయటపెట్టింది. దీని ప్రభావం అనివార్యమైన రీతిలో ఈడీ, ఐటీ, సీబీఐతో పాటు వాటిని నిర్దేశించే మోదీ ప్రభుత్వ విశ్వసనీయతపై కూడా ఉంటుంది.

> వివరాలు గమనించండి. ఎన్నికల బాండ్ల చట్టం మోదీ హయంలో 2017 నుంచి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలకు వ్యాపార సంస్థలు, వ్యక్తులు ఇచ్చే విరాళాలు పారదర్శకంగా ఉండటం ఇందులోని ప్రధాన ఉద్దేశమని అప్పట్లో అన్నారు. ఆ వివరాల్లోకి వెళ్లేందుకు ఇది సందర్భం కాదు. కానీ, విషయం పారదర్శకంగా ఎంతమాత్రం సాగటం లేదంటూ కొంత కాలం పాటు విమర్శలు జరిగాయి. అంతా అధికార పక్షానికి అనుకూలంగా రహస్యంగా జరుగుతున్నదని, కనుక బాండ్ల వ్యవహారాన్ని వెల్లడి చేయాలంటూ ఏడీఆర్ అనే సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లింది. బాండ్ల వివరాలు వెల్లడి చేయాల్సిందేనని కోర్టు ఉత్తర్వు ఇచ్చింది. అయినా ఆ చర్యను వాయిదా వేయించడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గట్టి ప్రయత్నం చేసినా కోర్టు అంగీకరించలేదు. చివరకు రెండు రోజుల క్రితం తగినన్ని వివరాలు బయటకు రావటం, మిగిలినవాటిని కూడా రప్పించేందుకు కోర్టు చేస్తున్న ప్రయత్నం తెలిసిందే.

ఇందులో గమనించవలసింది ఏమంటే, మోదీ ప్రభుత్వం పారదర్శకత పేరిట చేసిందంతా అందుకు విరుద్ధమేనని ఈసరికే దేశానికి అర్థమైంది. బాండ్ల రూపంలో అధికార పక్షం చేసింది వేలకోట్ల రూపాయల మేర లబ్ధి పొందటం. పెద్ద కంపెనీల నుంచి భారీ విరాళాలు సంపాదించి వాటికి లైసెన్సులు, కాంట్రాక్టులు ఇవ్వడం మోదీ ప్రభుత్వం చేసిన పని. కొన్ని కంపెనీలపై ఏజెన్సీల ద్వారా దాడులు జరిపి భయపెట్టి ఆ విధంగా వారు భారీ విరాళాలు ఇచ్చేట్లు ఒత్తిడి చేయడం. బాండ్లకు సంబంధించి మిగిలిన విషయాలు వెలుగులోకి వచ్చినప్పుడు ఈ నీతి పురాణాల గురించి దేశం మరింతగా అర్థం చేసుకోగలదు.

ఇవన్నీ చర్చించుకున్న తర్వాత ప్రస్తుత మద్యం పాలసీ ఆరోపణల కేసు గురించి గానీ, అందులో భాగంగా కవిత అరెస్టు, వారం రోజుల రిమాండ్ విషయం గురించి గానీ, మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గురించి గానీ ఇంకా మాట్లాడవలసింది బహుశా ఏమీ ఉండదు.

ఆహారం లేకుండా కొంతకాలం పాటు మనం ఉండగలమేమో గానీ, నీరు లేకుండా ఎక్కువసేపు జీవించలేం. అంతటి విలువైన నీటిని ఎంత జాగ్రత్తగా వాడుకోవాలి. కానీ, మనం చేస్తున్నదేమిటి? ఒక్క హైదరాబాద్‌లోనే చూసుకుంటే.. నగరంలోని 1.30 కోట్ల మంది రోజు సుమారు 448 మిలియన్ గ్యాలన్ల (203 కోట్ల లీటర్లు) నీటిని వాడుతున్నారు. అందులో 30 మిలియన్ గ్యాలన్ల (13 కోట్ల లీటర్లు) నీరు వృథా అవుతుండటం ఆందోళనకరం. ఒక కిలో లీటర్ నీటిని కృష్ణా, గోదావరి నదుల నుంచి నగరానికి తీసుకురావడానికి సుమారు రూ.45 వరకు ఖర్చవుతున్నది. అంటే ఈ లెక్కన.. 13 కోట్ల లీటర్లకు ఎంత అవుతుందో అర్థం చేసుకోవాలి. ఖర్చు సంగతి పక్కనపెడితే.. వృథా అవుతున్న నీటి విలువను వెలకట్టగలమా? గుక్కెడు నీటి కోసం పరితపించేవారికే ఆ విలువ తెలుస్తుంది.

# నీటి వృథాతోనే నగరాల వ్యథ



కన్నోజు మనోహరాచారి
79950 89083




పైపుల ద్వారా సరఫరా అయ్యే నీటిలో సుమారు 40 శాతం వృథా అవుతున్నట్టు పలు నివేదికలు తెలియజేస్తున్నాయి. మంచినీటి దుర్వినియోగం ఇలాగే కొనసాగితే 2040 నాటికి మన దేశ జనాభాలో 40 శాతం మందికి తాగునీరే దొరకదు. 2050 నాటికి జీడీపీలో భారత్ 6 శాతాన్ని కోల్పోతుందని ఓ అంచనా. భవిష్యత్తులో ఢిల్లీ సహా 21 నగరాల్లో భూగర్భ జలాలు కనుమరుగవుతాయని నీటి నిర్వహణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇష్టారాజ్యంగా నీళ్లను వృథా చేయడమే దేశంలో నీటి కటకటకు ప్రధాన కారణమని సెంట్రల్ వాటర్ కమిషన్ చెప్తున్నది.

ప్రపంచంలోని సుమారు 150 దేశాలు తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్టు వరల్డ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ద్వారా తెలుస్తున్నది. ఈ జాబితాలో ఖతార్, ఇరాన్, జోర్డాన్, కువైట్, యూఏఈ, ఇజ్రాయెల్, లెబనాన్‌తో పాటు మన దేశం కూడా ఉండటం విచారకరం. ఆస్ట్రేలియా, యూకే, దక్షిణాఫ్రికా దేశాలు నీటి వృథాను అరికట్టడాన్ని తమ జాతీయ ఎజెండాలో చేర్చాయి. వాననీటి సంరక్షణలో జర్మనీ ఇతర దేశాలకు పాఠాలు నేర్పుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో సింగపూర్ వాటర్ మేనేజ్‌మెంట్ నుంచి మనం ఎంతో నేర్చుకోవాలి.

> కేసీఆర్ సర్కార్ దూరదృష్టితో తీసుకున్న చర్యల కారణంగా గత పదేండ్లు తెలంగాణ జలకళను సంతరించుకున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అనేక పంట కాలువలు, చెరువులు, కుంటలు వేసవిలోనూ నీటితో కళకళలాడాయి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన నాటినుంచి తొమ్మిదిన్నరేండ్ల పాటు నీటి సంక్షోభం అనే మాటే లేదు. కానీ, ప్రస్తుతం తెలంగాణలో కరువు తాండవిస్తున్నది. పంటలు ఎండిపోతున్నాయి. నీటి కోసం మహిళలు రోడ్డెక్కుతున్నారు. అనతికాలంలోనే ఎందుకిలా జరుగుతున్నది?

హైదరాబాద్‌కు తాగునీరందించే ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి. నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. ఎమర్జెన్సీ పంపింగ్‌పైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొన్నది. అటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులు నిండుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉన్నది. నీటి వృథాను అరికట్టాలి. జల సంరక్షణ మనందరి బాధ్యత. చెన్నై, బెంగళూరు నగరాల దుస్థితి మనకు రాకూడదంటే ఇప్పటినుంచే నీటి వృథాను అరికట్టాలి. పాలకులు మేల్కొవాలి.




## బాండ్ల స్కీం.. అతిపెద్ద స్కామ్

ఎన్నికల బాండ్ల పథకం ప్రపంచంలోనే అతిపెద్ద స్కాం. బాండ్ల రూపంలో వచ్చిన డబ్బులతో మీరు ఎంపీలు, ఎమ్మెల్యేలను కొంటున్నారా? ఓటర్లకు లంచాలు ఇస్తున్నారా? దానిపై మేం ప్రశ్నించకూడదా? మన్‌కీ బాత్‌లో ప్రతీది మాట్లాడే మీరు.. దీనిపై ఎందుకు నోరు విప్పడం లేదు.

- ప్రకాశ్‌రాజ్, సినీ నటుడు

# సిద్దిపేటే.. ఓ కార్యశాల

> అది మార్గశిర మాసం. మాగి పొద్దు. సంక లేపితే చలి ఈడ్సితంతోంది. ముసుగుతన్ని సోయి లేకుండా నిద్ర పోతున్న. సెల్‌ఫోన్ అదే పనిగా మోగుతోంది. ఆగి.. ఆగి.. మళ్లీ రింగ్ అవుతోంది. నిద్రమత్తులోనే ఫోన్ తీసిన. అవతలి నుంచి బాబూ.. అంటూ ఓ స్వరం. 'ఊ..! చెప్పు' అని అన్న. 'దుబ్బాక కొట్టె రామచంద్రంను మాట్లాడుతున్న' అని అన్నడు అవతలి వ్యక్తి. ఆ గొంతు వణకుతున్నది. పైగా పక్కన ఏడ్పులు వినిపిస్తున్నయి.



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

రామచంద్రానికి, నాకు పెద్దగా పరిచయం లేదు. కానీ, ఆయన కొడుకు రాజు, కోడలు ఇందిరా సుపరిచితమే. ఆలోచనల నుంచి తేరుకొని 'ఏమైందే బాపు?' అని అడిగిన. 'కాశీకి పోతుంటే మా బస్సు లోయల పడ్డది' అని రామచంద్రం చెప్పిండు. 'ఎక్కడా?' అని అడిగిన ఆందోళనగా. 'ఏమో! అందరం నిద్రల ఉన్నం. బస్సు బోల్తాపడ్డది' అని అవతలి నుంచి సమాధానం. 'బస్సుల జనాలకు ఎట్లుంది' అని అడిగిన. 'ఏమో! సిమ్మ సీకటి. ఎవలు బతికిండ్రో? ఎవరు సచ్చిండ్రో? తెలుస్తలేదు' అని ఆయన కలత పడ్డడు.

అంతకుమించి ఆయన మాట్లాడే పరిస్థితి లేదు. నాగపూర్‌లో దిగి చాయ్ తాగినట్టు మాటల్లో చెప్పిండు. సమయం చూస్తే అర్ధరాత్రి ఒంటి గంట. ఇంత రాత్రి వేళ వాళ్లకు నేనేం సాయం చేయగలను, ఇందిరకు ఫోన్ చేసి చెప్దామా? వద్దా? అనే ఆలోచనలో పడ్డా. ఎక్కడో ఘటన జరిగింది, వాళ్లు మాత్రం ఏం చేయగలరు, అనవసరంగా వాళ్లను భయపెట్టడమేనని.. తలపోస్తున్న సమయంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు మతిల పడ్డడు. వెంటనే ఆయనకు ఫోన్ చేసిన. ఎత్తిండు. విషయం చెప్పిన. 'సరే! ఫోన్ మాట్లాడుతున్నడుగా, నాకు నెంబర్ ఇవ్వు' అని హరీశన్న అడిగిండు. నెంబర్ ఇచ్చి నిద్రలోకి జారుకున్న. మళ్లీ ఫోన్ రింగ్ అయింది. ఈసారి హరీశన్న నుంచి ఫోన్. 'అన్నా..' అని చెప్పిన. 'దేవుని దయ వల్ల అందరూ సేఫ్. నాగపూర్ ఎంపీతో, కలెక్టర్‌తో మాట్లాడిన. అందరినీ దవాఖానకు తరలించారు. ఇక పొద్దున చూసుకుందాం' అని చెప్పి ఫోన్ పెట్టేశారు. అప్పుడు సమయం చూస్తే తెల్లవారుజాము 4 గంటలు అవుతోంది. అంటే, ఈ నాలుగు గంటలు ఆయన నిద్రపోలేదన్నమాట. నాగపూర్ జిల్లా సరిహద్దు గ్రామం రంజోలి వద్ద ప్రమాదం జరిగిందట. ఆ రాత్రి నాగపూర్ నుంచి రంజోలి వరకు ఉన్న పోలీసు స్టేషన్లు, అధికారులను ఏకం చేసిండు హరీశన్న. సిద్దిపేట, సిరిసిల్ల, జగిత్యాల, మెదక్ జిల్లాల టూరిస్టులు బస్సులో ఉన్నరు. ఈ నాలుగు జిల్లాల కలెక్టర్లను నిద్ర లేపిండు. ఘటనాస్థలాన్ని గుర్తించి, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే వరకు ఆయన పరిశ్రమ ఆగలేదన్నమాట. ఈ ఘటన 2018 నవంబర్ 13న జరిగింది. అప్పుడు నేను ఓ పత్రికలో సిద్దిపేట జిల్లా బ్యూరో చీఫ్‌గా పని చేస్తున్న.

> ఏ ఎండకు ఆ గొడుగులు పట్టే నాయకులు వస్తుంటరు.. పోతుంటరు. జెండా పట్టే కార్యకర్తే స్థిరం. కార్యకర్తకు ప్రమోషన్ ఇస్తే, అతని చేతికి అధికారం వస్తే, హరీశ్‌రావు తీరు నిలబడుతరు. నిత్యం జనం మధ్యనే ఉంటరు. ప్రజా సంక్షేమం కోసం ఆలోచన చేస్తరు. ఆరాట పడుతరు. అప్పుడు కారుకు బ్రేకెక్కడిది? గులాబీ రంగుకు మరకెక్కడిది?

హరీశ్‌రావు ఓ సాధారణ కార్యకర్త. బాటా చెప్పులేసుకొని తెలంగాణ ఉద్యమానికి బాటలు దిద్దిన అసలు సిసలు కార్యకర్త. ఉద్యమంలో ఆకలిగొన్న సహచరులకు ఛాయో.. నీళ్లో ఇచ్చి కాపాడుకున్న కార్యకర్త. అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేస్తే తు.చ. తప్పని కార్యకర్త. ముందుచూపుతో కేసీఆర్ తీర్చిదిద్దిన కార్యకర్త. జనం కోసం, జనం మధ్య నిలబడిన కార్యకర్త ఆయన. 2004లో కేసీఆర్ 45,118 ఓట్ల మెజారిటీతో సిద్దిపేటలో గెలిచి అప్పటి టీఆర్ఎస్ కార్యకర్త హరీశ్‌రావుకు అప్పగిస్తే.. ఇవాళ ఆయన దాన్ని 1,20,650 ఓట్ల భారీ మెజారిటీకి తీసుకుపోయారు. నాయకునికి తన రాజ్యం మీద ప్రేమ ఉండాలే. ప్రజల మీద పాణం తీరు పావురం ఉండాలే. పూట పూట పలవరించాలి.. కలవరించాలి. అట్లా ఉంది కాబట్టే కాళేశ్వరం నిలబడ్డది. కాల్వలకు నీళ్లు మళ్లినయి. చెరువులు నిండినయి.. తరి మల్లు పారినయి. ఎండిన తెలంగాణ నిండుకుండగా తొణికిసలాడింది. ఆత్మహత్యలు లేని తెలంగాణగా అవతరించింది. అసాధ్యం అనుకున్నది సుసాధ్యం చేసిన అపురూప శిల్పి కేసీఆర్.



అట్లా పచ్చబడ్డ తెలంగాణలోకి భ్రమింపజేసే ప్రణాళికలు చొప్పించారు. ప్రజలను భ్రాంతిలోకి నెట్టారు. పాలిచ్చే పాడి బర్రె అనే భ్రమతో ఓటేస్తే అది ఎగిరి తన్నే దున్న అయింది. వంద రోజుల్లోనే దాని విశ్వరూపం చూపిస్తున్నది. కండ్ల ముందే నీళ్లు మాయమైనయి. కరెంటు పోయింది. పంటపొలం సక్కదనమే మారిపోతున్నది. ఇది చాలదు అన్నట్టు ఇప్పుడిక అసూయపరులంతా ఏకమవుతున్నరు. ఒక్క గొడుగు కిందికి మూగుతున్నరు. గద్దల్లా వాలుతున్నరు. రాష్ట్రంలో చిచ్చు పెట్టడానికి సిద్ధమవుతున్నరు. బాగుపడ్డ తెలంగాణ ఈనగాసి నక్కల పాలయింది. ఇంకా ఆగం వద్దు. మనోడు మనకుండాలే. కష్టమొస్తే కండ్లళ్ల పెట్టుకునే నాయకుడు కాదు.. గుండెల్ల పెట్టుకునే హరీశ్ తీరు నాయకత్వం కావాలి. కేసీఆర్ తీరు దార్శనికత ఉన్న మహర్షి కావాలే. ఇప్పుడంతా జాతర సీజన్. జాతర్ల శివాలూగినట్టు.. ఓ నెల, రెండు నెలలు అన్ని పార్టీలూ శివాలు తూలుతాయి. అటెన్క మళ్లీ ఐదేండ్లదాకా.. ఎవర్రారు. లేని భ్రమకు పోయి ఇప్పటి వరకు గోస పడ్డది చాలు.

ప్రతి ఓటరు విజ్ఞతతో ఆలోచన చేయాల్సిన సమయమిది. మాయ, మోహం చూపుతున్న వారి ముసుగులు విప్పించే నిర్ణయం తీసుకోవాలి. మన రాజ్యానికి మనమే నాయకులం కావాలి. ఒక ఎజెండా మనసుల పెట్టుకొని.. దొరికిన జెండా పట్టుకొని వచ్చే ఆయారాం గయారాంలు ఉంటారు. వాళ్లు పోతే పోయిండ్రు. నిఖార్సైన కార్యకర్తగా నిలబడితే భవిష్యత్తు తరం మీదే.